143) దేసాక్షి / ఖరహరప్రియ

ప॥ ఇంతదేవు డింక వేడీ యెంచి చూపుడా। చెంతనుండితే రక్షించు చేకొని కొలువరో॥

చ॥ వేసితే వేయిరూపులు విశ్వరూప మితడు। శ్రీసతీశు డిందరిలో శ్రీమంతుడు।
భాసురపుభూమిమోచేబలవంతు డిన్నిటాను। దాసులైతే మన్నించు నీదైవము గొలువరో॥

చ॥ గుట్టున బ్రహ్మాండాలు కుక్షిలో నించినవాడు। అట్టె దేవతలమొర లాలించేవాడు।
చిట్టకపుదానవుల చించిచెండాడేటివాడు। ఇట్టె శరణంటే గాచు నీతని గొలువరో॥

చ॥ కాలము గర్మము మాయ గల్పించినయట్టివాడు। ఆలించి సర్వజీవుల అంతర్యామి।
వాలి శ్రీవేంకటపతై వరములిచ్చేటివాడు। యేలీ గొల్చిన మెచ్చు నీవిభు గొలువరో॥